క్లుప్తంగా

సాక్షి మాథ్స్-బీ పరీక్షలకు విశేష స్పందన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గాయత్రీ శర్మ స్కూల్‌లో సాక్షి మీడియా వారు నిర్వహించిన మాథ్స్-బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. పరీక్షలకు 6,7,8,9 తరగతులకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 105 మంది హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజర్యారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు సాక్షి నిర్వహించిన పరీక్షలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. గతంలో కూడా స్పెల్-బీ రీక్షలకు తమ పాఠశాల విద్యార్థులు అవార్డులు అందుకున్నట్లు చెప్పారు.

సెల్‌టవర్ స్థలాల తనిఖీ

బొల్లాపల్లి: జిల్లా అటవీశాఖ అధికారి ఎం. రామచంద్రరావు గురువారం మండలంలోని బొల్లాపల్లి, రావులాపురం బీట్‌లను తనిఖీ చేశారు. ఆయా బీట్‌ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌టెల్ సెల్‌టవర్లకు సంబంధించి స్థల పరిశీలన చేశారు. తనిఖీ నిర్వహించి కాంపెన్‌సెటరీ ఏరియా తనిఖీ చేశారు. ఆయన వెంట బొల్లాపల్లి డీఆర్‌వో వై. సూర్యనారాయణ, బీట్ అధికారులు టి. రామకృష్ణ, కె.నాగార్జున, తదితరులు ఉన్నారు.

పాత నాగిరెడ్డిపల్లిలో విద్యాశాఖ అధికారుల పర్యటన



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేట డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వై.వేణుగోపాలరావు, నోడల్ ఆఫీసర్ ఎస్.పూర్ణచంద్రరావులు నూజెండ్ల మండలంలోని పాత నాగిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బాలికలకు నిర్దేశించిన హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పిల్లల విద్యాభి వృద్ధికి సలహాలు, సూచనలు అందజేశారు.

బిందు సేద్యంతో సాగు చేపట్టాలి



బొల్లాపల్లి: బిందు సేద్యం ద్వారా పంటల సాగు చేపట్టాలని, నీటి ఆదాకు రైతులు కృషి చేయాలని వ్యవసాయ అధికారి ఐ. మురళి సూచించారు. మండలంలోని గుమ్మనంపాడు గ్రామ పొలాల్లో పంటలను ఆయన గురువారం పరిశీలించారు. వర్షాభావంతో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పత్తి, మిరప, పొగాకు తదితర పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పోటాషియం నైట్రేట్‌ను ఎకరాకు కేజీ వంతున వాడాలన్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇప్పటి వరకు పంటలు వేయకుండా మిగిలిన పొలాలకు 40 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. గ్రామ సర్పంచ్ కె. పుల్లమ్మ, ఎంపీటీసీ వి. వెంకటరెడ్డి, వినుకొండ ఏడీఏ బి. రవిబాబు, ఏవో అంకారావు, ఎ.సాంబిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ఉండాలి

నరసరావుపేట రూరల్: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సాధ్యమవుతుందని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ వైద్యులు డాక్టర్ జోగా సృజన తెలిపారు. మండలంలోని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా జీవితకాలం పెరుగుతుందన్నారు. మహిళలకు వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, అండాశయ క్యాన్సర్‌తో పాటు వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులు, వాటి లక్షణాలను విద్యార్థినులకు వివరించారు. దీంతోపాటు మహిళలకు రుతుచక్రంలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. బంగారుతల్లి కార్యక్రమంపై పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం తెలియజేసారు. రక్తహీనత నివారణకు ఐరెన్, విటమిన్-సి మాత్రలను తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, పంచాయతీ కార్యదర్శి కె.వి.ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ అల్లా మస్తానీ, ఏఎస్ఎం విజయలక్ష్మి, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూరక్ష పథకం ద్వారా పారదర్శకంగా సర్వే

చిలకలూరిపేటటౌన్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం ద్వారా ఆస్తి వివాదాలు, ఇతర సమస్యల నుంచి విముక్తి లభించే అవకాశం ఉందని రీ సర్వే స్పెషల్ ఆఫీసర్ బి.సుబ్బారావు చెప్పారు. గురువారం పట్టణంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమానికి సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ హాలులో సచివాలయ రీసర్వే టీములతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరుకు రీ సర్వే పారదర్శకతతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ ఎ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత ఉండి ఇంకా సంక్షేమ ఫలాలు పొందని వారిని గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. పట్టణంలోని 30వ వార్డులోని సంజయ్‌గాంధీ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వినుకొండ పట్టణాన్ని తమదైన శైలిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పట్టణ తాగునీటి సమస్యను పరిష్కరించామని, రానున్న రోజుల్లో రెండు పూటల తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గత పదేళ్లల్లో వినుకొండ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందనే విషయాన్ని ప్రజలే గుర్తించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఎన్ఎస్‌పీ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, రైతు బజారు, ప్రభుత్వ బాలికలకు అదనపు తరగతి గదులు, పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ముస్లింలకు పాఠశాల, కళాశాల, వినుకొండ ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరి ప్రదక్షిణం రోడ్డు, మున్సిపల్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదల కోసం 5400 ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి అందలేని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించడమే గడపగడప ముఖ్యఉద్దేశమన్నారు. పదేళ్ల శాసన సభ్యుడిగా ఉన్న నీవు ప్రజల తాగునీటి సమస్యను ఎందుకు తీర్చలేకపోయావని ప్రశ్నించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వార్డు కౌన్సిలర్లు షకీలాదస్తగిరి, వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, ఆరెసామ్రాజ్యం, ఎంఎస్‌కే బాషా, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, రొడ్డావుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలూ.. ఆహారం రుచిగా ఉంటోందా?

- మెనూ ప్రకారమే ఇస్తున్నారా?
- పాఠాలు అర్థమవుతున్నాయా?
- విద్యార్థులతో మమేకమైన కలెక్టర్
- రొంపిచర్ల జెడ్పీ పాఠశాలలో తనిఖీ



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా.. లేదా అన్న విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. తరగతులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యశాలను పాతభవనంలో నుంచి నూతనంగా నిర్మించిన కొత్త భవనంలోకి మార్చాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ సమస్య ఉందని వైద్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నూతన భవనాన్ని పరిశీలించారు. వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది, ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బైక్ చోరీ

- పార్కింగ్ చేసిన వాహనం అపహరణ
- సీసీ ఫుటేజ్‌లో నిక్షిప్తం
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు



అపహరించే ముందు వాహనంపై కూర్చున్న నిందితుడు

నరసరావుపేట టౌన్: అది నరసరావుపేట లోని బస్టాండ్ ప్రాంతం.. వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రదేశం.. వచ్చే పోయే వాహనాలకు సందు లేదు.. ఆ రోడ్డు పక్కనే వరుసగా ఆగిన బైకుల్లో ఒక బైకుపై ఓ వ్యక్తి దర్జాగా కూర్చొని ఉన్నాడు. కొంచెం సేపు స్టైల్‌గా సిగరెట్ వెలిగించి మరో బైక్ పైకి మారాడు. మరో ఐదు నిమిషాలు గడిచిందో లేదో మరో బైక్ పైకి మారా డు. ఒక్క పది నిమిషాలు అటు ఇటు చూసాడు.. అంతే మరో నిమిషంలో అక్కడి నుంచి ఆ బైక్ మీద కూర్చున్న వ్యక్తి లేడు. ఆ బైకూ లేదు. ఇది నరసరావుపేటలో బైక్ చోరీల నిందితుల హవా. కొంతకాలంగా నర్సరావుపేట ప్రాంతంలో బైక్ దొంగతనాలు విపరీతంగా పెరిగిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. వరుసగా ద్విచక్ర వాహనాలు అపహరణకు గురౌవుతుండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నా రు. బైక్ చోరీ ముఠా అత్యంత చాకచక్యంగా తమ పని కానిచ్చేస్తున్నారు. తాజాగా గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రవేశించిన అగంతకుడు దర్జాగా ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లాడు. యడ్లపాడు గ్రామానికి చెందిన శివరామకృష్ణ ఆర్టీసీ బస్టాండ్‌లో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. పని ముగించుకొని గంట తర్వాత వచ్చే సరికి వాహనం కనిపించలేదు. సమీపంలోని కార్గో పార్శిల్ సర్వీస్ వద్ద ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ముఖానికి చేతి రుమాలు కట్టుకొని వచ్చిన యువకుడు వాహనాన్ని అపహరించుకు వెళ్లాడు. సమాచారాన్ని వాహన యజమాని వన్‌టౌన్ పోలీసులకు అందించాడు. దీంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజ్‌లో నిక్షిప్తమై ఉన్న వీడియోను సేకరించారు. నిందితుడి ఆచూకి కోసం గాలిస్తున్నారు.

నరసరావుపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం

298 మందికి వైద్యపరీక్షలు



పేర్లను నమోదుచేసుకుంటున్న స్థానికులు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్ నగర్‌లోని తిలక్ మున్సిపల్ హైస్కూలు ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 298 మంది 11వ వార్డు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. షాలెంనగర్ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను మున్సిపల్ ఇంజినీరు కనకారావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఆషాలత సారథ్యంలో డాక్టర్లు షేక్ పర్వీనా, ప్రత్యూష, డాక్టర్ విశ్వనాథ రెడ్డి ఎముకలు, కీళ్లు, జనరల్ మెడిసిన్ వైద్యసేవలు అందజేశారు. 98 మంది రోగులకు డాక్టర్ ఎంవీ కంటి వైద్య హాస్పిటల్ సిబ్బంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రూ.100లు నుంచి రూ.1500లు విలువైన మందులను పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంతో కూడిన వంటల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది సేవలను అందజేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛను సొమ్ము



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అంకమ్మకు వృద్ధాప్య పింఛను అందిస్తున్న వలంటీర్ మౌనిక



గణపవరంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్

నాదెండ్ల: గుంటూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న పింఛను లబ్ధిదారుడికి ఆసుపత్రికి వెళ్లి వలంటీర్ పింఛను సొమ్ము అందించటంతో ఆ కుటుంబంలో సంతోషం వ్యక్తం చేశారు. సాతులూరు సచివాలయం-2 పరిధిలో కుంచాల అంకమ్మ వృద్ధాప్య పింఛను లబ్ధిదారు. అయితే ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని గుంటూరు జీజీహెచ్‌లో పర్యవేక్షణలో ఉన్నాడు. వలంటీర్ రాయపూడి మౌనిక సమాచారం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందించారు. పంచాయతీ కార్యదర్శి ముదవర్తి రమేష్ సహకారంతో పింఛను పంపిణీ చేశారు. నెలనెలా ఇంటి వద్దనే పింఛను సొమ్ము అందేలా చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి లబ్ధిదారు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

84 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రెండో రోజు గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక- సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 84 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9701 మంది లబ్ధిదారులకు గాను రూ.2,67,47,500లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

5న ఢిల్లీ పబ్లిక్ స్కూలు అవగాహన సదస్సు

నరసరావుపేట: ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాలులో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు గురువారం చెప్పారు. ఈ సదస్సుకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత, విద్యావేత్త యండమూరి వీరేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. నర్సరీ నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సు అనంతరం రెండు నుంచి ఎనిమిదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి

నరసరావుపేట టౌన్: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెయింట్ జోసఫ్ పాఠశాల డైరెక్టర్ సి.బి.అబ్రహం అన్నారు. గురువారం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. నిత్య జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం అధికం అవ్వటం వలన పర్యావరణ కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాష్ చాకో, అకాడమిక్ ఇన్‌చార్జి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక ఆలయం నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 2వ తేదీ వరకూ 44 రోజుల వ్యవధిలో రూ.57505లు ఆదాయం సమకూరింది. అయితే గతేడాది ఈ ఆలయం దేవాదాయ శాఖలో విలీనమైన విషయం విదితమే. హుండీ లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మంజూష, ఈవో తులసీదాస్, గ్రామపెద్దలు నాగేశ్వరరావు, పర్చూరి కృష్ణారావు, గంగినేని అప్పారావు, మిరియాల లక్ష్మీనారాయణ, గుడికందుల యల్లారావు, కె.రామకృష్ణ, సుబ్బారావు, శ్రీనివాసరావు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎస్ఈబీ సిబ్బంది వినుకొండ రూరల్ మండల పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్ఈబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో గోకనకొండ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని అందులోని 8 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ట్రాక్టర్లను, డ్రైవర్లు అంకమశెట్టి చంద్రశేఖర్ (వేల్పూరు), వల్లెం అంకమ్మరావు (గోకనకొండ)లను అదుపులోకి తీసుకొని వినుకొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయ భాస్కర్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి విరాళం



భీమని అంకారావు దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి శావల్యాపురం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు భీమని అంకారావు, మస్తానమ్మ కుటుంబ సభ్యులు 2 లక్షల 116 రూపాయలను సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అంకారావు దంపతులకు ధన్యవాదాలు తెలిపి దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పెండేల వెంకట పుల్లారావు, ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, ట్రెజరర్ రెడ్డి నగేషబాబు, వైస్ ప్రెసిడెంట్ గంధం బాలిరెడ్డి, గజవల్లి నాగపవన్, కొత్తమాసు శివ తదితరులు పాల్గొన్నారు.

ఇస్సప్పాలెంలో...

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన ఆత్మకూరి రాజేంద్రప్రసాద్, ఉమాదేవి దంపతులు రూ.2,00,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో బుధవారం విరాళం చెక్‌ను ఆలయ ఈఓ టి.సుధాకర రెడ్డికి దాతలు రాజేంద్రప్రసాద్, ఉమాదేవి దంపతులు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు. విరాళాలు అందజేసే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్ రాజీనామా

నరసరావుపేట: చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు నరసరావుపేట యార్డు చైర్మన్ ఎస్ఏ.హనీఫ్ వెల్లడించారు. అయితే పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతానని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం యార్డు ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తన రాజీనామా విషయాన్ని వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు తోడ్పాటు అందించాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సర్పంచ్ కూరాకుల ఆదిలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు : ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసిన వాడే నిజమైన రాజకీయ నాయకుడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఉప్పరపాలెం, అంగలూరు గ్రామాల్లో గురువారం జరిగిన నూతన సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ప్రధానభూమిక పోషించాలని, అలాంటప్పుడే గ్రామాలు సస్యశ్యామలంగా మారతాయని అన్నారు. రాజకీయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక తెలుగుదేశం పార్టీ నాయకులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు వినుకొండలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రాష్ట్రంలో చంద్రబాబు నానా తిప్పలు పడుతున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వలేని జీవీ ఆంజనేయులు, గతంలో ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత వనికుంటలో రూ.3.50 కోట్లతో మోడల్ స్కూల్, ఈపూరులో రూ.6 కోట్లతో ప్రభుత్వ వైద్యశాల, కోటి రూపాయలతో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ నిర్మాణాలు జరిగాయన్నారు. ఇక వినుకొండ పట్టణానికి వస్తే గతంలో ఎన్నడూ లేనివిధంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, కూరగాయల మార్కెట్, కొండకు ఘాట్‌రోడ్డు నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడుకు బెయిల్ మాత్రమే వచ్చిందని ఆ మాత్రానికే తెదేపా నాయకులు సంబర పడాల్సిన పనిలేదని, ముందుంది ముసళ్ల పండుగ అని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉప్పరపాలెం సర్పంచ్ కూరాకుల ఆదిలక్ష్మి నరసింహారావు, అంగలూరు సర్పంచ్ సన్నెబోయిన ఆదిలక్ష్మి గోవిందరాజులును ఘనంగా సన్మానించారు. అలాగే వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గానికి ఎంపికైన దొడ్డా ఏడుకొండలును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కోపెల దేవరాజ్, శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, కూరాకుల వెంకట్రావు, గోలి ఏడుకొండలు, సన్నెబోయిన ఏడుకొండలు, ఎంపీడీవో రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



తహసీల్దార్ కుటుంబరావును స్వాగతిస్తున్న రెవెన్యూ సిబ్బంది

యడ్లపాడు: కలెక్టర్ ఆదేశాల మేరకు తాజాగా ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని నూతన తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. తాడికొండ తహసీల్దార్‌గా పనిచేస్తూ విభజన సమయంలో కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిలకలూరిపేట తహసీల్దార్ జి .సుజాత ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో బదిలీపై ఆయన యడ్లపాడు తహసీల్దార్‌గా బుధవారం విధు ల్లోకి వచ్చారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ స్పందన ద్వారా వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల విధు లు సక్రమంగా సకాలంలో నిర్వహిస్తామన్నారు. అలా గే సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ రెవెన్యూ పరమైన అన్ని పనుల్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కుటుంబరావును రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతించారు. కార్యక్రమంలో డీటీ ఎస్.శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ మోజేస్, రాష్ట్ర వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి కేపీ చారి, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- పార్టీ కార్యాలయంలో పేరు పేరునా అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- నాలుగున్నరేళ్లలో రూ.7.45 కోట్ల చెక్కులు పంపిణీ చేశామన్న ఎమ్మెల్యే



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలోని 17 మంది లబ్ధిదారులకు రూ.17.25 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పేరుపేరునా వారి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్నీ విధాలుగా సహాయపడుతూ ఆరోగ్య భద్రతపై భరోసా కల్పిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు చికిత్సకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. దీని వలన ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ విద్యా, వైద్యంకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. ఎవరైనా సరే వైద్యఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడా పోటీలకు వేల్పూరు విద్యార్థి



రెడ్డి హేమంత్

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో వాలీబాల్ క్రీడా పోటీల్లో 9వ తరగతి విద్యార్థి రెడ్డి హేమంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్ సుభాని గురువారం తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్ ,పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

బేస్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రత్నజ్యోతి చెప్పారు. పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎస్‌కె మున్సిఫ్, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్.కె.జబిన్‌తాజ్ అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు గురువారం పాఠశాల ప్రాంగణంలో అభినందన నిర్వహించారు.